ఆడది ఒంటరిగా బ్రతకలేదా? అన్న ప్రశ్నకు ఆమెకు దొరికిన సమాధానం!

# వెలగని దీపం

**కాకాని కమల కధ**

సాయంత్రం ఐదు గంటలు దాటుతోంది.

పూర్తిగా సూర్యుడు కృంగిపోయి సంజె వెలుగు పరుచుకుంటూంది.

దక్షిణ దిశగా చల్లగాలి తిరిగింది.

''అమ్మా! నేను మా ఇంగ్లీషు మేడం గారింటికెళ్లి వస్తాను'' తల్లికి చెప్పి రోడ్డుమీదకి వచ్చింది కవిత.

కవితను చూడగానే అందంగా వుందనిపిస్తుంది.

ఆమెనడక చూస్తే ఈ అమ్మాయికి తప్పక నాట్యం తెలుసు అనిపిస్తుంది. ఎందుకంటే ఆ రెండునిజాలు కనుక.

ఐదవ సంవత్సరంనుంచి నాట్యం నేర్పించారు. పలుసాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని ఇప్పుడిప్పుడే ఆమె ప్రతిభ వెలికి వస్తుంది.

బి.ఎస్సీ ఆఖరి సంవత్సరం చదువుతోంది. ముగ్గురు అన్నదమ్ములమధ్య ఒక్కతె కూతురు. అంతో ఇంతో కలిగిన కుటుంబం. ఎప్పుడూ చెదరని చిరునవ్వు ఆమె పెదవుల్ని అంటుకునే వుంటుంది. ఇవి కవిత ఎసెట్స్.

కాని ఇప్పుడు మాత్రం మబ్బుచాటు చందమామలా వుంది ఆమె వదనం.

సంవత్సరం క్రితం అరుంధతి ఆ ఊరి ఉమెన్స్ కాలేజికి ఇంగ్లీషు లెక్చరర్‌గా వచ్చింది. కవిత వాళ్లింటికి దగ్గర్లోనే ఆవిడ వుంటోంది. అందుకే కవిత తరచు వాళ్లింటికి వెళ్లి తెలియనివి చెప్పించుకుంటుంది. ఆవిడకేవన్నా చిన్న చిన్న సహాయం కావాలన్నా చూసిపెడుతుంది.

అరుంధతి ఒంటరిగా వుంటుంది. ఆవిడ వయసు 35-40 మధ్య వుంటుంది. ఇంకా పెళ్లి కాలేదు. బహుశా ఇంకా చేసుకోదేమోకూడా.

మనిషి చూడడానికి అందంగా హుందాగా వుంటుంది. కాని ఆవిడ గురించి రకరకాలుగా



వినిపిస్తుంది. పెళ్లికి ముందు ప్రేమలో మోసపోయిందని, పెళ్లి కాకుండానే తల్లి అయిందని, పెళ్లి అయిందికాని భర్త ఒదిలిపెట్టాడని, అసలు ఆమె పెళ్లికి పనికిరాదని ఇలా రకరకాలుగా ఆవిడగురించి చర్చించుకుంటారు.

అసలు విషయం మాత్రం ఎవరికీ తెలియదు.

''ఇంతకీ ఆవిడ ఎందుకు పెళ్లిచేసుకోలేదు?''

ఆలోచనల మధ్య కవిత రెండు వీధులు దాటి అరుంధతి మేడం ఇంటిముందుకు వచ్చింది.

కవిత వెళ్లేసరికి అరుంధతి డ్రాయింగ్ రూమ్‌లో కూర్చుని ఏదో ఇంగ్లీషు నవల చదువుకుంటోంది. కవితను చూస్తూనే పుస్తకం పక్కన పెట్టి చిరునవ్వుతో పలకరించింది. కబుర్ల మధ్య అరుంధతి తను చదువుతున్న నవల గురించి మాట్లాడసాగింది.

కవిత తలవంచుకుని అనాసక్తంగా 'ఊ ఊ' అంటోంది. కాని ఆ అమ్మాయి దృష్టి వేరే ఎక్కడో వుంది.

కవితకి ఇంట్లో పెళ్లి చేద్దాం అనుకుంటున్నారు. కాని కవితకి ఇప్పట్లో... ఊహు... అసలు ఇష్టం లేదు. జీవితంపట్ల ఆ అమ్మాయికి కొన్ని ఆశయాలున్నాయి. ముఖ్యంగా మంచి డాన్సరు కావాలని. కాని ఇంట్లో వాళ్లు వినడంలేదు. ఆమె అభీష్టానికి వ్యతిరేకంగా పెళ్లి ప్రయత్నాలు జరుపుతున్నారు.

అందుకే కవిత ముఖంలో నవ్వు మాయమైంది.

ఆ విషయం గురించే మేడం సలహా అడుగుదామని వచ్చింది.

కాని తీరా వచ్చాక మనసులో మాట అడగాలా వద్దా? అన్న డైలమాలో పడింది.

''కవితా?''

కవిత ఉలిక్కిపడి తల ఎత్తింది.

''ఏంటి మేడం?''

అరుంధతి ఆశ్చర్యంగా కవిత ముఖంలోకి చూసింది.

''ఏమిటి ఈ రోజు అలా వున్నావ్? నేను చెప్పేది నువ్వసలు వింటున్నావా లేదా?''

''సా... సారీ మేడం''

అరుంధతి మృదువుగా కవిత చేతిని పట్టుకుంది. ''ఏమిటి? అలా వున్నావు. నీ మనసు ఇక్కడ లేదు. ఇంట్లో ఏమన్నా గొడవ జరిగిందా?''

కవిత చిన్నగా నవ్వింది ''అబ్బే లేదు మేడం''

''మరెందుకలా వున్నావ్?''

''....''

రెండు నిమిషాల మౌనం తర్వాత తలఎత్తి నెమ్మదిగా అంది. ''నాకో సమస్య వచ్చింది మేడం. నేను ఎటూ నిర్ణయించుకోలేకుండా వున్నాను. మీ సలహా కోసం వచ్చాను''

''చెప్పు. నాకు తోచిన సలహా ఇస్తాను''

''మేడం. నేను డాన్సర్‌ని. ఆ విషయం మీకు తెలుసుకదా. ఇప్పుడిప్పుడే లైమ్‌లైట్‌లోకి వస్తున్నాను. మంచి డాన్సర్‌గా దేశ విదేశాలు తిరిగి రావాలని నా కోరిక. కాని మా ఇంట్లో నాకు పెళ్లి చెయ్యాలని అనుకుంటున్నారు. ఎవ్వరూ నా అభిప్రాయానికి విలువ ఇవ్వడంలేదు''

''అలాగా?''

''అవును మేడం. ఎల్లుండి నాకు పెళ్లిచూపులు. అతను డాక్టరు. ఆ అబ్బాయి తండ్రి మా నాన్నగారికి బాగా మిత్రుడట. ఈ పెళ్లి చూపులు నామమాత్రమే. మూడు వంతులు పైగా ఈ పెళ్లి కుదిరినట్టే. ఒకవేళ ఈ మాచ్ కాకపోయినా వేరే ఏదన్నా కుదిర్చి ఈ వేసవిలో చేసెయ్యాలని అమ్మా నాన్న తొందరపడుతున్నారు. కాని నాకిష్టంలేదు.''

''అలాగా? ఎందుకని? నీ మనసులో వేరే ఎవరన్నా వున్నారా?''

''నో... నో... అలాంటిదేం లేదు మేడం...''

''మరి ఏమిటి నీ సమస్య''

''నాకు అసలు ఇప్పట్లో పెళ్లి ఇష్టంలేదు. అసలు భవిష్యత్తులోకూడా పెళ్లి, సంసారం ఝంఝాటం ఇష్టం లేదు. నేను బాగా పైకి చదవాలనుకుంటున్నాను. రీసెర్చి చేసి డాక్టరేట్ సంపాదించాలని నా కోరిక. డాన్సులోకూడా ఆ స్థాయికి రావాలని ఆశపడుతున్నాను. ఒక డాన్సు

స్కూలు నడపాలనికూడా వుంది. ఆ తరువాత పెళ్ళిగురించి ఆలోచిస్తాను. కాని మా ఇంట్లో నా మాట ఎవరూ ఖాతరు చేయడంలేదు.''

'' ... ... ...''

''మేడం. మీరేం అనుకోనంటే మిమ్మల్నో విషయం అడుగుతాను''

''నువ్వు ఏం అడిగినా నేనేం అనుకోను. అడుగు''

''మీ... మీ.. రెందుకు మ్యారేజ్ చేసుకోలేదు. మ్యారేజ్ చేసుకోకుండా స్త్రీ బ్రతకలేదా? మీరు హాయిగానే వున్నారుకదా?''

అరుంధతి ముఖం వివర్ణం అయింది. నెమ్మదిగా కుర్చీలోంచి కిటికీ దగ్గరకు వచ్చింది. కిటికీకి అల్లుకున్న మనీప్లాంట్ ఆకుల్ని కదిలిస్తూ నెమ్మదిగా అంది.

''నేను ప్రేమలో మోసపోయానని, పెళ్ళికాకుండా తల్లినయ్యానని, నా భర్త నన్ను విడిచిపెట్టాడని, నా క్యారెక్టర్ మంచిదికాదని ఇలా నాగురించి ఎన్నో విన్నావ్. అవునా?''

కవిత ఇబ్బందిగా తల దించుకుంది.


అరుంధతి చిన్నగా నవ్వింది.

''కవితా! నువ్వు అనవసరంగా ఇబ్బంది పడకు. ఇది లోకం. వయసు మీరిన ఒక పెళ్ళికాని అమ్మాయిగురించి లోకం పలు రకాలుగా అనుకోవడంలో పొరపాటు లేదు. కాని నేను పెళ్ళిచేసుకోకపోవడానికి కారణాలు ఇవేమీ కాదు''

''మరి!?''

''నీలాగే నేను నీ వయసులో పెళ్ళి చేసుకోకూడదనుకున్నాను. మా వాళ్ళు తెచ్చిన సంబంధాల్ని తిరగ్గొట్టాను. పెళ్ళి నా ఆశయాలకు అడ్డు అనుకున్నాను. నేను ఉద్యోగంలో చేరాక కూడా నా కో లెక్చరర్ దగ్గర్నుంచి నాకు పెళ్ళి ప్రపోజల్స్ వచ్చాయి. అయినా నేను ఒక రకమైన ఈగోతో వాటిని తిరస్కరించాను. పెళ్ళి చేసుకుంటే స్త్రీ మగవాడికి బానిస అవుతుంది అనుకున్నాను. కాని రోజులు గడుస్తున్నకొద్దీ స్త్రీకి జీవితంలో పెళ్ళి-మాతృత్వం ఎంత మాధుర్యమైనదో తెలుసుకున్నాను. భగవంతుడు స్త్రీకోసం పురుషుడ్ని, పురుషుడికోసం స్త్రీని సృష్టించాడు. జీవితానికి అర్థం పరమార్థం తన సృష్టిద్వారానే తెలియచెప్పాడు. దానికి వ్యతిరేకంగా బ్రతకడంలోకూడా ఆనందం వుంది. కాని స్త్రీకైనా

# పాపం మనీషా!



'బొంబాయి' చిత్రంలో అద్భుతమైన నటనను చూపించి, ప్రేక్షకుల్ని ఎంతగానో ఆకట్టుకుంది సుప్రసిద్ధ హిందీనటి మనీషా కొయిరాలా. ఈ చిత్రం విజయం తనవల్లనే అయింది అని చెప్తుందట. మణిరత్నం ఎంతగా తపనపడి, ఎంత రిస్క్ తీసుకుని రూపొందించాడో ఆమెకు తెలియదా? తెలుసో తెలియదోగాని 'బొంబాయి' చిత్రం విజయంతో తన పారితోషికాన్ని విశేషంగా పెంచేసింది. దీనితో హిందీ నిర్మాతలు పలువురు ఆమెను బుక్ చేసుకుందామనుకుని విరమించుకున్నారట. తన రేటు పెంచడంతో చిత్రాలు లేక ఊరికుండిపోయింది పాపం మనీషా కొయిరాలా!

- సుబ్బారావు

పురుషుడికైనా ఒంటరితనం శాపమే. తోడు నీడ వున్నప్పుడు అందం ఆనందం ఎన్ని బిరుదులు, సన్మానాలు పొందినా ఒంటరితనం ఆ ఆనందాల్ని తుడిచిపెడతాయి. మనసు మనసుని కోరుతుంది. ఆడంబరాల్ని సన్మానాల్ని కదా''

''అంటే!?''

''కవితా! ఆ రోజు నేను చేసిన తప్పు నాకు ఇప్పుడు తెలుస్తోంది. ముందు ముందు నా చివరిరోజుల్లో ఇంకా తెలుస్తుంది. మనం ఒంటరిగా పవిత్రంగా వున్నా ఈ లోకం మనకి అపవిత్రత అంటగట్టి బురద చల్లుతుంది. ఆ క్షోభకంటె కొద్దిగా ఆశయాల్ని త్యాగం చేయడమే మనసుకి శాంతినిస్తుందేమో... నువ్వు అడిగావు కనుక నాకు తోచిన సలహా చెప్తున్నాను. నువ్వు పెళ్లిచేసుకో. నీ భర్త సహకారంతో నీ ఆశయాల్ని సాధించుకో. కావాలంటే పెళ్లికి ముందే నీ ఆశయాలగురించి అతనికి చెప్పు. ప్రపంచ ఖ్యాతి ఆర్జించకపోయినా నీ పరిధిలో నీ కళాసాధన విద్యాతృష్ణ తీర్చుకో. ఒంటరి ఏకాకిగా బ్రతికేకంటే పదిమంది మధ్య బ్రతకడంలో ఆనందం వుంది... ఆ పైన నీ ఇష్టం.''

''అక్కా!'' ఆ పిలుపుకి

కవిత అరుంధతి ఇద్దరూ గడపవైపు చూశారు.

కవిత తమ్ముడు హడావుడిగా వచ్చాడు. ''అక్కా! నాన్న ఆఫీసునుంచి వచ్చారు. అమ్మా నాన్న ఎక్కడికో బయటకు వెళ్తున్నారట. నిన్ను తొందరగా రమ్మంది అమ్మ''

''మళ్లీ వస్తా మేడం'' కవిత లేచింది.

''సరే...''

కవిత మెట్లు దిగి వెళ్లిపోతుంటే కిటికీలోంచి అలా చూస్తూ నిల్చుండిపోయింది అరుంధతి.

సరిగ్గా నాలుగు రోజుల క్రితం ఇలాంటి సమయంలోనే కవిత తల్లి అరుంధతి దగ్గరకు వచ్చింది. ''మేడం. కవిత ససేమిరా పెళ్లికి ఒప్పుకోనంటోంది. చాలా మంచి సంబంధం. గుమ్మంలోకి వచ్చింది. ఇది తెలిసి తెలియని తనంతో ఆదర్శం, ఆశయం అంటోంది. మీరు ఎలాగైనా దాని మనసు మార్చి ఈ పెళ్లికి ఒప్పుకునేలా చేయండి. మీకు పుణ్యం వుంటుంది. దానికి మీరంటే తగని గురి...''

ఆరోజు కవిత తల్లి అలా అర్థించబట్టే తను ఈనాడు కవితకి అలా ఆ చిన్న కట్టుకథ అల్లి చెప్పాల్సివచ్చింది. కాని నిజానికి తను ఇంత వయసు వస్తున్నా పెళ్లికాకుండా మిగిలిపోవడానికి తను చెప్పిన కారణాలే కారణమా?

''ఊహు... కాదు'' ఒక్కసారి అరుంధతి ఆత్మావలోకనం చేసుకుంది.

తను నిజంగానే మోసపోయింది. చదువుకునే రోజుల్లో ప్రేమంటూ తన వెంటపడిన సురేష్ పెళ్లి దగ్గరకు వచ్చేసరికి ముఖం చాటేశాడు. పెళ్లికి ముందే ఫ్రీగా వుండే తనలాంటి అమ్మాయంటే అతనికి సదభిప్రాయం లేదట. తనలాంటి వాళ్లు గరల్‌ఫ్రెండ్స్‌గానే గాని భార్యలుగా తగరట. తనలా విచ్చలవిడిగా వుండే అమ్మాయిలు పెళ్లిపేరుతో కట్టుబడి వుండలేరుట.

ఆ మాట తన మనసుని గాయపరిచింది.

ప్రేమ, ఆరాధన అంటూ తను ఎంతగానో నమ్మిన ఆ సురేష్ అలా మాట్లాడేసరికి తనకి బ్రతుకుమీదే విరక్తి వచ్చింది. నిద్రమాత్రలు మింగింది. కాని ఇంట్లో చూసి సరైన సమయంలో హాస్పిటల్‌కి చేర్పించడంతో తను బ్రతికింది.

కాని ఎందుకో మగవాడి మీదే ఏవగింపు కలిగింది. వాళ్లది క్షణానికో రంగుమార్చే ఊసరవెల్లి తత్వం అనిపించింది. కట్టుకున్న భార్య, ఒక ఆడది తనకంటే పేరుసంపాదించుకోవడం ఏ మగవాడు సహించలేడేమో! పెళ్లికి ముందు ఆదర్శాలు అభ్యుదయ భావాలు వల్లించినా ఆచరణకి వచ్చేసరికి

ఒప్పుకోలేడు. స్త్రీ స్వాతంత్ర్యం గురించి ఉపన్యాసాలు ఇచ్చే మగవాడే స్త్రీని వంటింటి కుందేలులా చూస్తాడు. భార్యకి ఒకనీతి పరాయి ఆడదానికి ఒక నీతి సృష్టిస్తాడు.

సురేష్ ప్రేమ పేరుతో తనకి అలాగే పాఠం చెప్పాడు. ఆ పాఠమే తనకి పెళ్లిపట్ల విముఖురాల్ని చేసింది. స్త్రీ మరచిపోలేని గుణపాఠం అయింది.

''స్త్రీ ఒంటరిగా బ్రతకలేదా?'' అనుకుని తను బ్రతికింది. తోడుకోసం అప్పుడప్పుడు మనసు పరితపించినా దెబ్బతిన్న అహం ఆ పరితాపాన్ని చల్లారుస్తుంది.

కాని ఈ మాట కవితకి చెప్తే ఆ అమ్మాయి పెళ్లికి ససేమిరా అంది.

వెయ్యి అబద్ధాలు ఆడి అయినా ఒక పెళ్లి చేయాలి అంటారు.

తన బ్రతుకు వ్యర్ధం అయిందని చెప్పి ఆ అమ్మాయి జీవితాన్ని ఎందుకు తుడిచెయ్యాలి?

ఆ అమ్మాయిని కోరి వరించి వచ్చిన మనిషినుంచి ఆమెను ఎందుకు దూరం చెయ్యాలి. ఆ పిల్లమీద ప్రేమతో అతను ఆమె కళాసాధనకి చేయూతనిస్తాడేమో!

కళకంటే ఆదర్శంకంటే ప్రేమతత్వం గొప్పది.

ఆ గొప్పదనం కవితకి లభిస్తే ఆమె బ్రతుకు ధన్యమేకదా!''

అరుంధతి ఆలోచిస్తూ రోడ్డుకేసి చూస్తూ వుండిపోయింది.

కవిత వెళ్లి చాలాసేపయింది. బయటంతా చీకటి అలుముకుంటోంది.

అందరిళ్లలో దీపాలు వెలిగాయి. కాని అరుంధతి ఇల్లు చీకటిగా వుంది. ఆమె వెళ్లి దీపం వెయ్యకుండా చీకట్లో అలాగే కూర్చుంది.

చీకటికి అలవాటుపడిన ఆమె మనసు ఆ చీకటిలోంచే వెలుగు చూడడానికి ప్రయత్నిస్తోంది.

★ ★ ★

